

# బీఎస్ఎన్ఎల్ 4జీ రెడీ

**ప్రభుత్వ రంగ సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) 4జీ సేవలు అందించేందుకు సిద్ధమవుతోంది. స్వదేశీ టెక్నాలజీతో 4జీ సేవలను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ నెల 15 నుంచి 4జీ సేవలు ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో అందుబాటులోకి రానున్నాయి. ఈమేరకు బీఎస్ఎన్ఎల్ యంత్రాంగం సొంత టవర్లను 4జీగా అప్‌గ్రేడ్ పనులు ముమ్మరంగా చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని రాజంపేట, రాయచోటి నియోజకవర్గాల్లో 4జీ సేవలు అందుబాటులోకి వచ్చాయి.**




- రాజంపేట, రాయచోటిలో ఇప్పటికే సేవలు
- ఈ నెల 15న అధికారికంగా ప్రారంభం
- సెప్టెంబరు నాటికి 75 శాతం 4జీ టవర్లు ఏర్పాటు
- ప్రైవేటు సెల్ కంపెనీల చార్జీల పెంపుతో..
- బీఎస్ఎన్ఎల్ వైపు చూస్తున్న వినియోగదారులు
- జూలైలో 8వేల కొత్త కనెక్షన్లు




(కడప-ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు బీఎస్ఎన్ఎల్‌కు సామాన్య జనానికి ఎనలేని బంధం ఉండేది. ల్యాండ్ ఫోను మొదలుకుని 2జీ, 3జీ వరకు బీఎస్ఎన్ఎల్‌నే వినియోగించే వారు. మారుమూల గ్రామాల్లో సైతం బీఎస్ఎన్ఎల్ టవర్స్ ఉండేవి. అయితే జియో రాకతో టెలికాం స్వరూపమే మారిపోయింది. 4జీ అంటూ మార్కెట్లోకి వచ్చిన జియో దూసుకెళ్లింది. ఇప్పుడు అది 5జీ సేవలను అందిస్తోంది. ఎయిర్‌టెల్ కూడా 5జీకి సిద్ధమవుతోంది. అయితే ఇంకా బీఎస్ఎన్ఎల్ 3జీలోనే ఉండేది. గతంలో ప్రభుత్వాలు కూడా బీఎస్ఎన్ఎల్‌కు చేయూత ఇవ్వకపోవడంతో 4జీని లాంచ్ చేయలేకపోయింది.

### మళ్లీ బీఎస్ఎన్ఎల్ రాక

ఆగస్టు 15న దేశవ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో 4జీ సేవలను బీఎస్ఎన్ఎల్ ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు టాటాతో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో దేశీయంగా రూపొందించిన టీఎస్ఎఫ్ టెక్నాలజీతో 4జీ సేవలు అందించనున్నారు. ఈ మేరకు శరవేగంగా టవర్ల అప్‌గ్రేడ్‌తో పాటు నూతన టవర్ల ఏర్పాటు ముమ్మరంగా సాగుతోంది. ఉమ్మడి కడప జిల్లాలో 290 బీఎస్ఎన్ఎల్ టవర్లు ఉన్నాయి. ఇప్పటికే రాజంపేట, రాయచోటి నియోజకవర్గాల్లో 17 టవర్లను 4జీగా అప్‌గ్రేడ్ చేసి అక్కడ సేవలందిస్తోంది. ఇక ఈ నెల చివరి నాటికి 90 టవర్లను 4జీగా అప్‌గ్రేడ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నెల 15వ తేదీ నాటికి 44 టవర్ల ద్వారా 4జీసేవలు అందిస్తామని బీఎస్ఎన్ఎల్ అధికారులు అంటున్నారు. కడప నగరంలో 13, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల మైదుకూరు, పోరుమామిళ్ల, వేంపల్లెలో టవర్లను అప్‌గ్రేడ్ చేసి సేవలందిస్తారు. జిల్లాలో అక్టోబరు చివరి నాటికి 75 శాతం టవర్లను అప్‌గ్రేడ్ చేసి 4జీ సేవలు అందిస్తారు. వచ్చే ఏడాది మార్చి నెల చివరి నాటికి జిల్లా వ్యాప్తంగా అన్ని టవర్లలో 4జీ సేవలు అందుబాటులోకి వస్తాయి. అలాగే మెరుగైన సేవల కోసం అదనపు టవర్లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు.

### బీఎస్ఎన్ఎల్ వైపు..

ప్రైవేటు టెలికాం ఆపరేటర్లు గత జూలైలో రీచార్జి ధరలను భారీగా పెంచారు. ఈ సమయంలోనే బీఎస్ఎన్ఎల్ 4జీ వైపు అడుగులు వేస్తూ వచ్చింది. దీంతో ప్రైవేటు కంపెనీల నుంచి పోర్టు ద్వారా బీఎస్ఎన్ఎల్‌కు మారి కొత్త బీఎస్ఎన్ఎల్ సిమ్‌లు తీసుకుంటున్నారు. దీంతో జూలైలో కొత్తగా 8వేల మైచిలుకు పోర్టు, ఇతర నెట్‌వర్క్‌ల నుంచి వచ్చిన వాళ్లు, కొత్త కనెక్షన్లు తీసుకున్నారు. జిల్లాలో ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ పోస్టు, ప్రీపెయిడ్ కలుపుకుని లక్షా 59వేలు ఉన్నాయి.




### చౌక ధరలు

ప్రైవేటు కంపెనీలు రీచార్జి ధరలు భారీగా పెంచాయి. అయితే బీఎస్ఎన్ఎల్‌లో తక్కువ ధరలకే ఆకర్షణీయ ప్లాన్‌లు ఉన్నాయి. ఇతర నెట్‌వర్క్‌ల నుంచి బీఎస్ఎన్ఎల్‌లోకి వచ్చేవారి కోసం రూ.249 ప్లాన్ ఉంది. ఇది 45 రోజుల వ్యాలిడిటీ, అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు వంద ఎస్ఎంఎస్‌లు, 2జీబీ డేటా ఉంటుంది. రూ.149 ప్లాన్‌లో 30 రోజుల వ్యాలిడిటీ, 24 జీబీ, అన్‌లిమిటెడ్ కాల్స్ ఇస్తారు. రూ.1,999 ప్లాన్ ఉంది. ఇది వార్షిక ప్లాన్. అన్‌లిమిటెడ్ కాల్స్, డేటా ఉంటుంది. రూ.666 ప్లాన్. ఇది 105 రోజులవ్యాలిడిటీ ఉంటుంది. రోజుకు 2జీబీ డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్ ప్రస్తుతం 2జీ, 3జీ సిమ్‌లు ఉన్న వారు వాటిని 4జీగా అప్‌గ్రేడ్ చేసుకోవాలి. బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఉచితంగానే 4జీ అప్‌గ్రేడ్ చేస్తారు.

ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్వో గంగాధర్ గౌడ్



## ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి : డీఆర్వో

కడప(కలెక్టరేట్), ఆగస్టు 5: జిల్లా నలుమూలల నుంచి వచ్చే అర్జీదారుల సమస్యలను, వెంటనే పరిష్కరించాలని డీఆర్వో గంగాధర్ గౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి ఫిర్యాదులను డీఆర్వో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సత్సృప్తి చెందేలా నిర్ణీత గడువులో పరిష్కారం చూపాలన్నారు. పదేపదే అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా.. డయల్ యువర్ కలెక్టర్‌లో భాగంగా సోమవారం ఉదయం 9-30 నుంచి 10-30 గంటల వరకు ఫోన్ ద్వారా వచ్చిన 12 ఫిర్యాదులను డీఆర్వో గంగాధర్ గౌడ్ తెలుసుకున్నారు. తదుపరి చర్యలకై సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## గడువులోగా సమస్యలు పరిష్కరించాలి


ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, సెబ్ అదనపు ఎస్పీ జి.వెంకటరాముడు

కడప (క్రైం), ఆగస్టు 5: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, సెబ్ అదనపు ఎస్పీ జి.వెంకటరాముడు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఏఎస్పీల ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని ఏఎస్పీలు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీసుస్టేషన్లలో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అంతేకాక ఎన్‌సీఆర్‌పీలో మరియు టోల్‌ఫ్రీ నెంబర్‌ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ కె.రవికుమార్ పాల్గొన్నారు.

## సీఎం సదస్సులో కలెక్టర్, ఎస్పీ



కడప (కలెక్టరేట్), ఆగస్టు 5: అమరావతిలోని సచివాలయంలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు పాల్గొన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఇతర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, పలువురు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, అన్ని జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. కాగా ఇదే కార్యక్రమానికి కడప కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వర్చువల్ విధానంలో జేసీ అదితి సింగ్, పలువురు జిల్లా అధికారులు హాజరయ్యారు.

## ఈ కష్టాలు భరించలేకున్నా..!

- నన్ను ఇండియాకు రప్పించండి సార్...
- సౌదీ అరేబియాలో నిమ్మనపల్లి మహిళ కష్టాలు
- తనను కాపాడాలంటూ వేడుకోలు


హసీనా

నిమ్మనపల్లి, ఆగస్టు 5: అప్పుల బాధ నుంచి గట్టెక్కాలని డబ్బు సంపాదన కోసం సౌదీఆరేబియాకు వచ్చాను. ఇక్కడ సేఠ్‌లు నాకు నరకాన్ని చూపిస్తున్నారు.. నన్ను ఇక్కడి నుంచి ఇండియాకు రప్పించండి సార్.. అంటూ ఓ మహిళ తన భర్త, ఆమె తండ్రికి పంపిన వీడియో వైరల్‌గా మారింది. వివరాలిలా ఉన్నాయి. నిమ్మనపల్లి మండలంలోని తురకపల్లికి చెందిన హసీనా (25)కు స్వగ్రామంలోనే హసన్ అలీతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే కుటుంబ బాధలతో ఆమె సౌదీ అరేబియాలో ఇంటిలో పనిచేసేందుకు నెలరోజుల క్రితం వెళ్లినట్లు కటుంబీకులు తెలిపారు. హసీనా పంపన వీడియోలో తనను ఇంటి యజమానులు వేధిస్తున్నారని, రాత్రి పగలు అనే తేడా లేకుండా పనిచేయాల్సి వస్తోందని, రేకుల షెడ్డులో పడుకోవాల్సి వస్తోందని అందులో వేడికి తట్టుకోలేకపోతున్నానని చాలా నరకంగా ఉందని రోదిస్తూ తెలిపింది. మీకు దండం పెడతాను సార్.. ఇక్కడే ఉంటే నేను చనిపోతానని, నన్ను ఎలాగైనా ఇండియాకు రప్పించండి సార్... నా ఇద్దరు కుమారులను చూడాలని వుంది అంటూ వేడుకుంది. ఏదో నాలుగు రూపాయలు సంపాదించాలని సౌదీకి వచ్చానని, తీరా ఇక్కడికి వచ్చాక కష్టాలు తెలిశాయని తనను కాపాడాలని కోరింది. ప్రభుత్వం స్పందించి హసీనాను కాపాడాలని ఆమె తండ్రి మస్తాన్ కోరుతున్నాడు.

మత్స్యశాఖ కార్యాలయం




## మత్స్యశాఖలో సిబ్బంది కొరత

- డిప్యుటేషన్‌పై జిల్లా అధికారి
- లోపిస్తున్న పర్యవేక్షణ
- మత్స్య సంపద అభివృద్ధికి ఆటంకాలు

కడప (ఎన్జీఆర్ సర్కిల్), ఆగస్టు 5: జిల్లాలో మత్స్యశాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. మత్స్యసంపద ఎదుగుదలకు అవసరమైన నీటి వనరులు జిల్లాలో ఉన్నప్పటికీ వాటిపై దృష్టి సారించేందుకు తగినంత సిబ్బంది లేకపోవడంతో మత్స్యకారులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో ఉన్న ఒక్క ఏడీ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ ఏడీగా ఉన్న అధికారిని అన్నమయ్య జిల్లాకు కేటాయించారు. నలుగురు మత్స్య అభివృద్ధి అధికారులు ఉండాల్సి ఉండగా కేవలం ఒక్కరు మాత్రమే ఉన్నారు. విలేజీ ఫిషరిస్ అసిస్టెంటులు 8మందికి గాను ఆరుగురు ఉన్నారు. జిల్లా ఉన్నతాధికారిగా బాధ్యతలు నిర్వహించాల్సిన డిప్యూటీ డైరెక్టరును ఇక్కడి నుంచి వర్క్ అడ్జెస్ట్‌మెంటు పేరుతో ఎన్టీఆర్ జిల్లాకు డిప్యుటేషన్‌పై గత ప్రభుత్వం పంపింది. ఇక్కడకు అనంతపురం జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టరు కె.శాంతిని వర్క్‌అడ్జెస్ట్‌మెంటు పేరుతో డిప్యుటేషన్‌పై నియమించారు. అనంతపురం డీడీని ఇక్కడికి ఇన్‌చార్జిగా నియమించడంతో పర్యవేక్షణ కొరవడుతోందనే ఆరోపణలు వినిస్తున్నాయి.


### మత్స్యఅభివృద్ధికి ఆటంకాలు

జిల్లాలోని చెరువులు, జలాశయాల్లో ప్రతి సంవత్సరం మత్స్యశాఖ చేపపిల్లలను వదులుతోంది. కొన్ని సందర్భాల్లో జిల్లాలోని కడప, బి.మఠం మత్స్యక్షేత్రాల్లో చేపగుడ్ల నుంచి పిల్లలను ఉత్పత్తి చేసి వాటిని చెరువులు, జలాశయాల్లో వదులుతుంటారు. ఈ ఏడాది కడప నర్సరీలో 20 లక్షలు, బి.మఠం నర్సరీలో 25 లక్షల చేప పిల్లల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇవి కాకుండా 90 లక్షల చేపపిల్లలను ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద 40 శాతం రాయితీతో సరఫరా చేయనున్నారు. వీటన్నింటినీ జిల్లాలోని చెరువులు, రిజర్వాయర్లలో వదులుతారు. ఒక్కో చేపపిల్లకు ఒకటిన్నర రూపాయి విలువతో టెండర్లు నిర్వహించినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. సోమశిల, గండికోట, బి.మఠం రిజర్వాయర్లలో వందశాతం రాయితీతో చేపపిల్లలను వదిలి అక్కడ మత్స్య అభివృద్ధిని చేపట్టి... అనుమతి ఉన్న మత్స్యకారులకు జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో మొత్తం 32 మత్స్య సహకార సొసైటీలు ఉండగా అందులో 26 జనరల్, ఆరు మహిళా సంఘాలు పనిచేస్తున్నాయి. 1,344 మంది మెంబర్లు ఈ సంఘాల్లో ఉన్నారు. ఇటీవల 433 మందికి కొత్తగా అనుమతులు ఇచ్చినట్లు మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు.

### లోపిస్తున్న పర్యవేక్షణ

ప్రభుత్వం ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సాయంతో చేపపిల్లలను కొనుగోలు చేసి జలాశయాల్లో వదులుతోంది. అలా వదిలిన చేపపిల్లలను అభివృద్ధి చెందక ముందే అలవి వలలతో అక్రమంగా వేటాడడం వల్ల.. మత్స్యకారులు వేటాడేందుకు చేపలు ఉండకపోవడంతో జీవనోపాధికి ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఈ అంశాలపై దృష్టి సారించి మత్స్యశాఖలో సిబ్బంది కొరత నివారించడంతో పాటు రెగ్యులర్ ప్రాతిపదికన అధికార యంత్రాంగం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

### చర్యలు తీసుకుంటాం..



బి.మఠం, కడప నర్సరీల్లో చేప పిల్లల ఉత్పత్తి జరుగుతోంది. త్వరలో జలాశయాలు, చెరువుల్లో వదిలేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంలో వచ్చిన ఒక సమాచారంతో మా సిబ్బంది నిఘా ఉంచేందుకు వెళ్లగా.. ఎటువంటి అక్రమ చేపల వేటదారులు ఎదురుపడలేదు. ఎక్కడైనా అక్రమంగా చేపల వేట కొనసాగితే.. మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

**- కె.శాంతి, మత్స్యశాఖ డీడీ**


కడపలోని చేపల నర్సరీ

ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌పై

## ఫోర్జరీ కేసు నమోదు..?

మదనపల్లె టౌన్, ఆగస్టు 5: మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన గౌతమ్‌తేజపై ఫోర్జరీ కేసు నమోదు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం కేసులో పోలీసులు అనుమానిస్తున్న సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ కొన్ని ఫైళ్లలో గతంలో పనిచేసిన ఆర్డీవో మురళి, హరిప్రసాద్ సంతకాలను ఫోర్జరీ చేసి 22-ఏ ఫైళ్లను నడిపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఆర్డీవోలుగా పనిచేసిన మురళి, హరిప్రసాద్ తమ సంతకాలను గౌతమ్‌తేజ ఫోర్జరీ చేసినట్లు పోలీసులకు తెలిపినట్లు సమాచారం. గౌతమ్ తేజపై ఇదివరకే ఒక కేసు నమోదు కాగా, రెండోది ఫోర్జరీ కేసు నమోదు చేసినట్లు తెలిసింది. దీనిని వన్‌టౌన్ పోలీసులు ధ్రువీకరించలేదు. మొత్తం మీద మదనపల్లె తహసీల్దార్ కార్యాలయం నుంచి ఫైళ్లు రాకపోయినా మదనపల్లె మండలం కోళ్లబైలు గ్రామ పంచాయతీ నుంచి మూడు 22-ఏ ఫైళ్లపై కొందరు ఫోర్జరీ సంతకాలు చేసి ఆర్డీవో కార్యాలయానికి పంపినట్లు తెలిసింది. పదిరోజుల క్రితం రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా నిర్వహించిన తహసీల్దార్ల సమావేశంలో ఓ తహసీల్దార్ తాను కోళ్లబైలు ఫైలుపైన సంతకాలు చేయలేదని స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలిసింది. అలాగే మరో తహసీల్దార్ కూడా కోళ్లబైలు పంచాయతీ పరిధిలో 22-ఏ ఫైలుపైన సంతకాలు చేయకున్నా, కొందరు ఫోర్జరీ సంతకాలు చేసినట్లు తెలిసింది. మొత్తం మీద ఇప్పటి వరకు నమోదైన ఎనిమిది కేసుల్లో ఫోర్జరీ సంతకాల కేసుల్లోనే వన్‌టౌన్, టూటౌన్, తాలూకా స్టేషన్‌లలో కేసులు నమోదు అయినట్లు తెలుస్తోంది.

### తహసీల్దార్ల సంతకాలూ ఫోర్జరీ..?

మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం కేసులో ఇప్పటికే నలుగురిపై ఫోర్జరీ సెక్షన్ల కింద కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు మదనపల్లె మండల తహసీల్దార్ల సంతకాలు ఫోర్జరీ అయ్యాయనే కోణంలో విచారణ ప్రారంభించారని తెలిసింది. మదనపల్లె మండలంలో పలు నిషేధిత జాబితాలో ఉన్న 22-ఏ భూములకు సంబంధించి కొత్త జీవో ప్రకారం భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని భూయజమానులు తహసీల్దార్లకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం వీఆర్వో క్షేత్రస్థాయిలో విచారించి ఆర్ఐ పర్యవేక్షణలో, డిప్యూటీ తహసీల్దార్ ఫైలును పరిశీలించి సైడు ఇనిషియల్ వేశాక తహసీల్దార్‌కు పంపుతారు. తహసీల్దార్ స్వయంగా ఆ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిజమైనవిగా తేల్చి సంతకాలు చేసి ఫైళ్లను ఆర్డీవోకు నివేదిక పంపుతారు. కానీ మదనపల్లె తహసీల్దార్ కార్యాలయం నుంచి నిబంధనలు పాటించని కొన్ని ఫైళ్లు తహసీల్దార్లకు సంబంధం లేకుండా నేరుగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లినట్లు సమాచారం. అంతేకాకుండా మూడు ఫైళ్లలో తహసీల్దార్ల సంతకాలు ఫోర్జరీ చేశారనే అనుమానాలు వచ్చాయి. ఈ క్రమంలో ఇటీవల పోలీసులు నమోదు చేసిన కేసుల్లో కూడా ఫోర్జరీ సెక్షన్లు నమోదు కావడం గమనార్హం. దీనిపై పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో స్థానిక వన్‌టౌన్ పోలీసులు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్లను విచారించేందుకు చర్యలు చేపట్టారని సమాచారం. కాగా ఇక్కడ పనిచేసిన తహసీల్దార్లు బదిలీపై వెళ్లగా వారు పనిచేస్తున్న చోటకే వెళ్లి తహసీల్దార్ల నుంచి సంతకాలు వారివా.. కాదా..? అనే కోణంలో స్టేట్‌మెంట్లు రికార్డు చేయనున్నట్లు తెలిసింది.

## రిజిస్ట్రేషన్ శాఖల్లో సీసీ కెమెరాలు



కడప(కలెక్టరేట్), ఆగస్టు 5: మదనపల్లెలో రెవెన్యూ రికార్డుల దహనం నేపథ్యంలో రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల్లో రికార్డుల భద్రతకు ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టింది. మదనపల్లి ఘటన పునరావృతం కాకుండా ఉండేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రత్యేకించి రికార్డు రూముల్లోకి వచ్చిపోయే వారిపై నిఘా పెట్టేలా సీసీ కెమెరాల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు జిల్లా స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ శివరామ్ ఆదేశాల మేరకు జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబు జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 24 సీసీ కెమెరాలను సోమవారం ఏర్పాటు చేశారు.

## ముంపు గ్రామాల్లో.. పురాతన ఆలయాలపై కన్ను

- విగ్రహాలను ధ్వంసం చేసి..
- గుప్తనిధుల కోసం.. విచ్చలవిడిగా తవ్వకాలు

కొండాపురం, ఆగస్టు5: గండికోట ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో ఉన్న పురాతన ఆలయాలపై అక్రమార్కుల కన్ను పడింది. ప్రస్తుతం గండికోట బ్యాక్‌వాటర్ లేకపోవడంతో గుప్త నిధులకోసం ఆలయాల వద్ద విస్తృతంగా తవ్వకాలు జరుపుతున్నారు. ముఖ్యంగా పురాతన ఆలయాలపై అక్రమార్కుల కన్ను పడింది. వీటిలో రాజులు సంపద దాచిపెట్టి ఉంటారనే పుకార్లతో ఇక్కడ తవ్వకాలు జరుపుతున్నారని అంటున్నారు. కొండాపురం మండలంలోని చౌటిపల్లెలో దక్షిణ బదిరి నరనారాయణ స్వామి ఆలయం ఉంది. ఇక్కడ, బదిరిలో తప్ప నరనారాయణుల(కృష్ణార్జునలు)కు మరెక్కడా ఒకేచోట గుడిలేదని చెబుతుంటారు. ఇదే గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శివాలయం ఉంది. దీనిని జనమేజేయుడనే రాజు సర్పయాగం నిర్వహించడంలో భాగంగా నిర్మించాడని గ్రామస్తులు చెబుతుంటారు. ఇదే మండలంలో పురాతన రామాలయం ఉంది. ఈ ఆలయాలన్నింటిలో గుప్త నిధుల కోసం విగ్రహాలను ధ్వంసం చేసి విచ్చలవిడిగా తవ్వకాలు జరువుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళ ప్రొక్లెయిన్‌లు తీసుకుని వచ్చి తవ్వేస్తున్నట్లు సమాచారం.

### ప్రాజెక్టులో నీళ్లు తగ్గడంతో..

గండికోట ప్రాజెక్టులో నీళ్లు తగ్గడంతో మూడు నెలల నుంచి ముంపుగ్రామాల్లో ఉన్న ఆలయాలన్నీ బయటపడ్డాయి. ఈ గ్రామాల్లో జనాలు ఉండరు. పోలీసు గస్తీ కూడా ఉండదు. ఇదే అదనుగా గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపేవారు చెలరేగిపోతున్నారు. ఇదిలాగే కొనసాగితే మన సంస్కృతి చిహ్నాలైన పురాతన ఆలయాలు కనుమరుగయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆలయాలను పరిరక్షించాలని కోరుతున్నారు.



పాత చౌటిపల్లె రామాలయంలో విగ్రహాల కింద తవ్విన దృశ్యం, ధ్వంసమైన సీతారామలక్ష్మణ విగ్రహాలు


పాత చౌటిపల్లె బదిరీ నరనారాయణ స్వామి ఆలయం ఎదురుగా జరిపిన తవ్వకాలు

### సమాచారమిస్తే చర్యలు తీసుకుంటాం..

గ్రామాలు నీటిలో మునిగిపోవడవ వల్ల దారులన్నీ పాడైపోయాయి. ప్రస్తుతం గండికోట బ్యాక్‌వాటర్ తగ్గడంతో ఆలయాలన్నీ బయటపడ్డాయి. ఆలయ నిర్వాహకులు విలువైన సంపద ఉంటే తీసుకెళ్లాలి. అక్కడ తవ్వకాలు జరుపుతున్నట్లు ఎవరైనా సమాచారమిస్తే చర్యలు తీసుకుంటాం.

**- యోగీంద్ర, ఎస్సై, కొండాపురం**


ఆలయం లోపల విగ్రహాలు ధ్వంసం చేసి తవ్విన దృశ్యం

# పేదల కోసమా.. కాంట్రాక్టర్ల కోసమా!

- జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు
- ఐదేళ్లలో పది ఇళ్లు కూడా పూర్తి కాని వైనం
- భారీగా బిల్లులు దండుకున్న అధికారులు, కాంట్రాక్టర్లు

మైదుకూరు రూరల్, ఆగస్టు 5: పేద, మధ్య తరగతి కుటుంబాలకు సొంతింటి కల సాకారం చేసేందుకు గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీ పేరుతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. అయితే ఇళ్ల నిర్మాణాలు పేదల కోసమా లేక కాంట్రాక్టర్ల కోసమా అనే విధంగా జరిగాయి. కాలనీలో మొత్తం 2,121 ఇళ్లు మంజూరు కాగా.. గత ఐదేళ్లలో పట్టు మని పది ఇళ్లు కూడా పూర్తి కాలేదు. అయితే కాంట్రాక్టర్లు మాత్రం ఇప్పటి వరకు డ్వాక్రా సంఘాల నుంచి కాకుండా.. సుమారు 16.58 కోట్ల రూపాయల బిల్లులు చేసుకొని సొమ్ము చేసుకున్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

మైదుకూరు-బద్వేలు రోడ్డులోని గడ్డమాయపల్లె ముక్కొండ సమీపంలో జగనన్న కాలనీలో ఏబీసీడీఈ బ్లాకులుగా విభజించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. 2,121 ఇళ్లు మంజూరు కాగా.. ఇంత వరకు గుంతలు కూడా తీయనివి 175, పునాదుల వరకు తీసినవి 653, గోడల వరకు వచ్చినవి 219, స్లాబ్ అయినవి 827, పెయింట్లు అయి పోయి పూర్తి అయినవి 246గా అధికారులు రికార్డులలో ఉన్నాయి. కానీ వాస్తవానికి అక్కడ కేవలం పదుల సంఖ్యలో మాత్రమే ఇళ్ల నిర్మాణాలు జరిగినట్లు సమాచారం. ఇక ఇళ్ల నిర్మాణాలు పూర్తికాక మునుపే గోడలు నెర్రలు చీలి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. కాలనీలో కనీస సౌకర్యాలు కూడా లేవు. ఏ వీధిలో సిమెంటు రోడ్డు లేదు. నీటి సౌకర్యం కల్పించలేదు. మెయిన్ రోడ్డు నుంచి వచ్చే రెండు వరుసల రహదారి కూడా కంకర పరిచి వదిలేశారు.

జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులు మాత్రం అధికారుల, కాంట్రాక్టర్ల ఒత్తిడితో డ్వాక్రా సంఘాల ద్వారా, బయట వడ్డీలకు అప్పులు తెచ్చి ఇచ్చారు. డబ్బులు ఇచ్చాం.. పనులు మాత్రం చేయలేదని కాంట్రాక్టర్‌ను అడిగితే అక్కడ నీళ్లు లేవు, బిల్లులు రాలేదు అంటూ సాకులు చెప్పి తప్పించు కున్నారని వాపోతున్నారు. కొందరైతే డబ్బులు ఇచ్చాం.. మా ఇంటి పనులు మొదలే పెట్టలేదని చెబుతు న్నారు. ఏదిఏమైనా పేద, మధ్య తరగతి కుటుంబాల జీవితాలతో ఆడుకుంటూ ఇటు అధికారులు, అటు కాంట్రాక్టర్లు డబ్బులు మాత్రం దోచుకున్నారని.. ఇళ్ల నిర్మాణాలు మాత్రం పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో జగనన్న కాలనీపై కలెక్టర్ దృష్టి సారించి పేదలకు న్యాయం చేయాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.



జగనన్న కాలనీలో సిమెంటు రోడ్డు లేని దృశ్యం

### డబ్బులు తీసుకొని రెండేళ్లయ్యింది..

మాకు ఈ బ్లాకులో ఇల్లు మంజూరైంది. కాంట్రాక్టర్ ఇంటి నిర్మాణం చేస్తాము, డబ్బులు ఇవ్వమని అడుగగా.. అప్పు చేసి 15 వేల రూపాయలు 2022 జూన్‌లో అయనకు ఫోన్‌పేలో డబ్బులు వేశాము. కానీ ఇంత వరకు గుంతలు కూడా తీయలేదు. ప్రభుత్వం మారింది, ఇప్పుడు మా పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు.

*-ఏ.వరలక్ష్మి, జగనన్న ఇంటి లబ్ధిదారు*

### చర్యలు తీసుకుంటాం...

జగనన్న కాలనీలో అవినీతి జరిగిందని రుజువైతే చర్యలు తప్పవు. నేను ఇటీవలే బాధ్యతలు చేపట్టాను. కాలనీలో జరిగిన పరిస్థితులపై పూర్తి నివేదికలను కిందిస్థాయి అధికారులతో అడిగి తెలుసుకుంటా.. ఏవైనా అవకతవకలు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటాము.

*-గోపాలక్రిష్ణ, హౌసింగ్ డీఈ*



జగనన్న కాలనీలో పిచ్చి చెట్ల మధ్య అసంపూర్తిగా ఉన్న ఇళ్లు



ఇళ్లు పూర్తికాక మునుపే నెర్రెలు చీలిన దృశ్యం

## బస్సు బైక్ ఢీ... వ్యక్తి మృతి



ఆదినారాయణరెడ్డి మృతదేహం

గాలివీడు, ఆగస్టు 5: ఎదురెదురుగా వస్తున్న బస్సు బైక్ ఢీకొన్న ప్రమాదంలో ముండ్ల ఆదినారాయణ (50) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... మృతుడు తంబళ్లపల్లి మండలం దేవరింటి పల్లె నివాసి కాగా గాలివీడు మండలం ఉయ్యాలవాండ్లపల్లెలో తన కుమార్తెను ఇచ్చి వివాహం చేశాడు. సోమవారం కుమార్తెను, మనుమరాలిని చూసి తిరుగు ప్రయాణంలో గాలివీడులో తన వ్యక్తిగత పనులు చూసుకుని వెళుతుండగా మార్గమధ్యంలో కుమ్రపల్లె కొయ్యమిషన్ వద్ద మదనపల్లె నుంచి వస్తున్న అద్దె బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. దీంతో ద్విచక్రవాహన చోదకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లెకు తరలించారు.

## గంజాయి కేసులో ముగ్గురు వ్యక్తులు అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఇబ్రహీం

కడప (క్రైం), ఆగస్టు 5 : కడప నగరంలోని టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో మార్కెట్‌యార్డు సమీపంలో సీఐ జి.ఇబ్రహీం ఆధ్వర్యంలో సోమవారం ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.30వేలు విలువైన 3.2 కిలోల గంజాయిని, రూ.15110 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో శంకరాపురానికి చెందిన రాజేశ్‌కుమార్, పెద్దబెస్తవీధికి చెందిన చిరుబోయిన సుధీర్, రామాంజనేయపురానికి చెందిన నీలం గిరిశంకర్‌లు ఉన్నారు. వీరిని అరెస్టు చేయడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని సీఐ అభినందించారు.

## రెడీమేడ్ షోరూం యజమానిపై దాడి

కడప (క్రైం), ఆగస్టు 5 : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉడిపి హోటల్ ఎదురుగా ఉన్న వికాస్ రెడిమేడ్ షోరూం యజమాని వికాస్‌కుమార్‌పై అక్కడ పనిచేస్తున్న బాలాజీ అనే యువకుడిని సరిగా పనిలోకి రాకపోతే మానెయ్యాలని చెప్పాడు. దీంతో బాలాజీ తన స్నేహితులైన శ్రీధర్, ఉపేంద్రలతో కలిసి వచ్చి దాడి చేయడంతో వికాస్ గాయపడ్డాడు. సోమవారం బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ భాస్కర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి తైక్వాండోలో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు



తైక్వాండో పోటీలలో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

కడప (స్పోర్ట్స్) ఆగస్టు 5 : అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈనెల 2,3,4 తేదీలలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో జిల్లా క్రీడాకారులు సత్తా చాటి ద్వితీయ చాంపియన్స్‌గా నిలిచారు. ఇందులో రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 425 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో కడప జిల్లా నుంచి 41 మంది క్రీడాకారులు పాల్గొనగా.. ఏడుగురు బంగారు పతకాలు, మరో నలుగురు రజిత పతకాలు, మరో ఐదుగురు కాంస్య పతకాలు సాధించారు. మొత్తం 107 పాయింట్స్ సాధించి ద్వితీయ చాంపియన్స్‌గా నిలిచినట్లు జిల్లా తైకాండో అధ్యక్షుడు బి.శివశంకర్‌రెడ్డి, కార్యదర్శి మాస్టర్ నాయబ్ రసూల్ వెల్లడించారు. ఇందులో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు వచ్చే సెప్టెంబర్ 9, 10, 11 తేదీలలో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఆగ్రాలో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనాల్సివుందని వారు వెల్లడించారు. ఇదిలా వుండగా జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు జిల్లా ఒలంపిక్ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి రవాణా చార్జీల కింద ఒక్కో క్రీడాకారుడికి రూ.2 వేలు అందించనున్నట్లు స్పష్టం చేశారు.

## రాయలసీమ డయాసిస్ ఆస్తులను పరిరక్షించండి




నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కడప (మారుతీనగర్), ఆగస్టు 5: అన్యాక్రాంతమవుతున్న రాయలసీమ డయాసిస్ ఆస్తులను పరిరక్షించాలని రాయలసీమ ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సీఎస్ఐ రాయలసీమ అధ్యక్ష మండలి సంఘా లు, రాయలసీమ ప్రజాసంఘాల సంయుక్త ఆధ్వర్యం లో స్థానిక కోటిరెడ్డి సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాయలసీమ డయాసిస్ చర్చి ఆస్తులను ఇతరులకు దారాదత్తం చేస్తున్న కడప సీఎస్ఐ చర్చి బిషప్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నాయకులు అవ్వారు మల్లికార్జున, జేవీ రమణ, సంగటి మనోహర్, గ్రేటర్ రాయలసీమ నాయకులు కె.ఆంజనేయులు మాట్లాడారు. లీజు పేరుతో ఎక్కువ (సుమారు 40 సంవత్సరాలు) సంవత్సరాలకు చర్చి స్థలాలను ఇష్టారాజ్యంలా కట్టబెట్టి కోట్లాది రూపాయలు దండుకుని సొమ్ముచేసుకుంటున్నారని ఆరోపించారు. రాయలసీమ వ్యాప్తంగా వున్న అన్ని జిల్లాల్లో గల స్థలాలను ప్రయివేటు వ్యక్తులకు అప్పనంగా కట్టబెడుతూ లబ్దిపొందుతున్నారని నిప్పులు చెరిగారు. దీనిపై త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌ను కలుస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా అధికారులు స్పందించి డయాసిస్ ఆస్తులు పరుల పాలు కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కమలాపురం పాస్టర్ ఐక్యతరావు, జనతాదళ్ పార్టీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, వివిధ ప్రజాసంఘాల నాయకులు, పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

కలికిరి, ఆగస్టు 5: కలికిరి క్రాస్ రోడ్డులో గత శుక్రవారం తీవ్ర అనా రోగ్యానికి గురయిన గుర్తు తెలియని వ్యక్తిని స్థానిక పోలీసులు అంబులెన్స్ సాయంతో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను సోమవారం వేకువ జామున మృతి చెందినట్లు పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యక్తిని గుర్తించిన వారు కలికిరి పోలీసు స్టేషనుకు సమాచారం అందజేయాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో రామసముద్రం వాసి మృతి

రామసముద్రం, ఆగస్టు 5: తమిళనాడులోని రాణీపేట వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామసముద్రం వాసి మృతి చెందాడు. రామసముద్రం మండలం భూసానికురప్పల్లెకు చెందిన రైతు కె.రామచంద్ర (50) ఆదివారం సాయంత్రం క్యాలీ ఫ్లవర్‌ను ఐషర్ వాహనంలో చెన్నై మార్కెట్టుకు తీసుకెళ్తుండగా రాణీపేట వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి వాహనం బోల్తా పడింది. దీంతో రామచంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు.

## జ్ఞాన సంపదతోనే ఆర్థిక సంపద

- వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి



వెబ్‌నార్‌లో మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 5: జ్ఞాన సంపదతోనే ఆర్థికసంపద సాధ్యపడుతుందని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి అన్నారు. సోమవారం వైవీయూ కామర్స్ శాఖ అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్థిక ప్రణాళికతో సంపద సృష్టి అంశంపై జాతీయ వెబ్‌నార్ నిర్వహించారు. వెబ్‌నార్ కన్వీనర్ రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి సమన్వయం వహించగా, వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధమైన విధానాల వల్లనే ఆర్థిక పరిపూర్ణత సాధించగలమన్నారు. వెబ్‌నార్ కన్వీనరు పర్వనాథరెడ్డి మాట్లాడుతూ ధనం మూలం ఇదం జగత్ అన్నట్లు వ్యక్తుల అవసరాలకు ఆర్థిక వనరులు ప్రాథమికమైనవి, ఆర్థిక ప్రణాళిక ద్వారా సంపద సృష్టి జరుగుతుందన్నారు. పెట్టుబడుల్లో పితామహుడైన వారంబఫిట్ జీవితం గురించి వివరించారు. కార్యక్రమంలో కామర్స్‌శాఖ విభాగాధిపతి ప్రొఫెసరు విజయభారతి, సహాయాచార్యులు డాక్టర్ జి.హరినాథ్, పద్మ పాల్గొన్నారు.

## పీజీ నాలుగో సెమిస్టరు ఫలితాలు విడుదల

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 5: వైవీయూ పోస్టుగ్రాడ్యుయేషన్ నాలుగో సెమిస్టరు ఫలితాలను వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు రఘునాథరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డిలు విడుదల చేశారు. పీజీ కోర్సులైన సైకాలజీ, మైక్రోబయాలజీ, మేథమేటిక్స్, జియాలజీ, ఫుడ్ టెక్నాలజీ, జువాలజీ మైక్రోబయాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, బోటనీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎంపీఈడీ సబ్జెక్టుల్లో ఉత్తమ ఫలితాలు లభించాయన్నారు. కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణ అధికారులు డాక్టర్ మమత, డాక్టర్ శ్రీనివాసరావు, వెంకట్రామ్, పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, పీడీ

పుల్లంపేట, ఆగస్టు 5: రాష్ట్రస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థిని విద్యార్థులు ఎంపికైనట్లు పుల్లంపేట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ లీలాశ్రీహరి తెలిపారు. ఈనెల 4న రాయచోటిలో జరిగిన జూనియర్ బాల బాలికల సాఫ్ట్‌బాల్ ఎంపికలలో బాలికల విభాగంలో ఫస్టియర్ ఎంపీసీ విద్యార్థిని మధు, 9వ తరగతి విద్యార్థిని జాస్మిన్, బాలుర విభాగంలో 9వ తరగతి విద్యార్థులు గోపికృష్ణ, రిషిత్‌లు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. సెప్టెంబరు 15 నుంచి 19వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను, పీడీ నీలకంఠరావును అభినందించారు.

## 22 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

పీలేరు, ఆగస్టు 5: ఒక వాహనంతో సహా 22 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో జేవీ సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి పీలేరు మీదుగా చెన్నైకు ఎర్రచందరం అక్రమ రవాణా జరగుతోందన్న సమాచారం మేరకు తాము ఆదివారం రాత్రి 9 గంటల నుంచి కల్లూరు నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. సోమవారం ఉదయం 2.30 గంటల ప్రాంతంలో పీలేరువైపు వస్తున్న నెంబరు లేని టయోటా ఇతియోస్ కారు తాము ఆపినా ఆగకుండా వేగంగా వెళ్లిపోయిందన్నారు. తాము ఆ వాహనాన్ని వెంబడించగా బెంగళూరు-తిరుపతి రహదారిలోని చెర్లోపల్లె వద్ద కారును ఆపివేసి, డ్రైవర్, మరో వ్యక్తి చీకటిలో పారిపోయారన్నారు. కారును తనిఖీ చేయగా అందులో 349 కేజీలు బరువున్న 22 ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. దీంతో కారుతో సహా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. పారిపోయిన వారి కోసం కూడా గాలింపు ముమ్మరం చేశామన్నారు.

# అనర్హులకే అందలం

- సభ్యత్వం లేని వారికి, ప్లాట్లు లేని వారికి ఓటు హక్కు
- హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికలలో నిబంధనల ఉల్లంఘన
- డబ్బులు కట్టిన తమకు ప్లాట్ ఇవ్వలేదంటున్న బాధితులు
- నిజాలు వెలికి తీసేందుకు ప్రయత్నిస్తే బెదిరింపులు

పులివెందుల రూరల్, ఆగస్టు 5: పులివెందుల ప్రభుత్వ ఉద్యోగుల కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో అనర్హులకే అధికప్రాధాన్యత ఇస్తున్నారు. సభ్యత్వం లేని వారికి, ప్లాట్లు లేని వారికి ఓటు హక్కు కల్పించారు. ఎన్నికలలో యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారంటూ ప్రశ్నించినవారికి జిల్లాస్థాయి అధికారులతో సంబంధాలు ఉన్న ఓ వ్యక్తి సంబంధిత శాఖ అధికారుల నుంచి ఒత్తిడి తెచ్చి ఆ ఎన్నికలను ఏకగ్రీవం చేసుకున్నారు. సభ్యుల సంఖ్య ఎంత, వాస్తవ సభ్యులు ఎవరు, ఓటర్లు ఎవరు, ప్లాట్లు ఎన్ని, ఏకగ్రీవం అయ్యేందుకు సహకరించిన అధికారులు, అడ్డుపడకుండా ఎలాంటి బెదిరింపులకు దిగారు లాంటి వాటిని వెలికితీయాలంటే సమగ్ర విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు. సొసైటీ బైలా ప్రకారం నడుచుకోలేదని పలువురు చెబుతున్నారు.

### నిబంధనలు ఇలా...


పులివెందుల తాలూకాలో పనిచేసే వారు మెంబర్ షిప్ తీసుకోవాల్సి ఉంటుంది. మెంబర్‌షిప్ తీసుకున్న వారితో పాటు కుటుంబ సభ్యుల పేరుతో ప్లాట్, బిల్డింగ్ లాంటివి ఉండకూడదు. ఉద్యోగి ఇతర జిల్లాలకు చెందిన వ్యక్తి అయి ఉండకూడదు. మరొక సొసైటీలో పేరు ఉండకూడదు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉండకూడదు. భార్యభర్తలు ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండకూడదు, నోటిఫికేషన్ ఇవ్వాలి, అందరికీ తెలియజేయాలనే తదితర నిబంధనలు ఉన్నాయి. కానీ 2023లో పులివెందుల హౌస్ బిల్డింగ్ సొసైటీలో ఇవేమీ పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. పోటీ దారులు ఉన్నప్పటికీ వారిని ఎలాగోలా తప్పించి ఎన్నికను ఏకగ్రీవం చేసుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అప్పట్లో ఎన్నికలో తలదూర్చిన వారిని ఎన్జీఓ నేత తన అధికార పలుకుబడితో బెదిరించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఎన్నికలు జరపాలని కలెక్టర్ ఉత్తర్వు ఇస్తే.. పబ్లికేషన్ చేయలేదని చెబుతున్నారు. సొసైటీ ఎన్నికలు నిర్వహించే అధికారి నోటిఫికేషన్ ఇవ్వలేదని చెబుతున్నారు. ఎన్జీఓ నేత, ఎన్నికల అధికారి కలిసి పోటీ చేయకూడదని ఫోన్లు చేయడం, నామినేషన్లు వేయకూడదని చెప్పడం, వినకపోతే ఆయా శాఖలకు సబంధించిన ఉన్నతాధికారులతో ఫోన్లు చేయించడం ఇలా పలు రకాలుగా బెదిరింపులకు దిగారని పలువురు చెబుతున్నారు.

### ఇష్టానుసారం ప్లాట్ల కేటాయింపు

పులివెందుల పట్టణంలోని కదిరిరోడ్డులో ఉన్న ఎన్జీఓ కాలనీలో ప్లాట్లకేటాయింపులో అక్రమాలు జరిగాయని చెబుతున్నారు. సభ్యత్వం తీసుకున్నప్పటికి సీనియారిటీ ప్రకారం కాకుండా తమకు అనుకూలమైన వారికి, తమ కుటుంబసభ్యులకు ప్లాట్లు పంచుకున్నారని విశ్వసనీయ సమాచారం. 2010 సమయంలో గతంలో రూ.75వేలు, రూ.1.50లక్షలు, రూ.5లక్షలు వెచ్చించి మూడు ఎకరాలు కొనుగోలు చేశారు. వీటిలో చాలా వరకు ఎన్జీఓ నేతలుగా చెలామణి అవుతున్న కొందరు ఇష్టానుసారంగా వ్యవహరించి ప్లాట్లు అమ్ముకున్నారనే ఆరోపణలు వచ్చాయి. అనంతరం 2023లో హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సభ్యత్వం తీసుకున్న వారికి కాకుండా తమ సొంత మనుషులు, కుటుంబ సభ్యుల పేర్లతో స్థలాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిసింది. అప్పట్లో లక్ష రూపాయలతో కొనుగోలు చేసిన ఎకరా స్థలం, 2019 తర్వాత ఒక ప్లాటే దాదాపు రూ.5లక్షలు పలికింది. అందులోను కదిరికి వెళ్లే మెయిన్ రోడ్డు పక్కనే ఉండడంతో ప్లాట్లకు విపరీతమైన డిమాండ్ ఉండేది. దీంతో కోట్ల రూపాయలు చేతులు మారాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం సొసైటీలో ఉన్న కొందరికి మాత్రమే ప్లాట్లు ఉన్నాయని, కొందరికి మొండిచేయి చూపి బ్యాంకుల్లో లోన్లు ఇప్పించారని తెలిసింది. ఈ విషయంపై పులివెందుల ఎన్జీఓ సంఘంలోని ప్రధాన నేతను ప్రశ్నిస్తే.. తమ సంఘానికి డబ్బు అవసరమైనప్పుడు ప్లాట్లు అమ్ముకుంటామని, తమ ఇష్టమని సమాధానమిచ్చారు.

### ప్రస్తుత ప్రెసిడెంట్ కుటుంబ సభ్యుల పేరుతో ఇళ్లు

పులివెందుల హౌస్ బిల్డింగ్ సొసైటీకి ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న గురుప్రసాద్ కుటుంబ సభ్యులకే ప్లాట్లు ఉన్నట్లు పరిశీలనలో వెల్లడైంది. దీనిపై విచారణ చేస్తే కొంచెం ఎన్జీఓ ప్లాట్, మరికొంత ఇతర పట్టా భూమికి చెందిన స్థలంలో ఇంటి నిర్మాణం సాగుతున్నట్లు స్పష్టమైంది. దీంతో సొసైటీ ఏ మేర అక్రమాలకు పాల్పడ్డారనే విషయం వెల్లడవుతోంది. ఈ విషయంపై పలువురు ఉద్యోగులు కేసు కూడా వేసినట్లు తెలిసింది. దీనిపై సమగ్ర విచారణచేస్తే అక్రమాలు బయటకు వస్తాయని పలువురు ఉద్యోగులు చెబుతున్నారు.



### డబ్బులు చెల్లించినా.. ప్లాట్ కేటాయించలేదు

తాను పులివెందుల తాలూకా సింహాద్రిపురం మండలంలోని కోవరంగుట్టపల్లె పీహెచ్‌సీలో ఏఎన్ఎమ్‌గా పనిచేస్తున్న సమయంలో సభ్య త్వం పొందాను. ఎంపీహెచ్‌ఎస్‌గా విధులు నిర్వహిస్తూ 2002లో ప్లాట్ కోసం రూ.1300, 2004లో రూ.3000 డబ్బులు చెల్లించి రసీదు పొందాను. అయినప్పటికీ నాకు ప్లాట్ కేటాయించలేదు. సీనియారిటీ ప్రకారం ప్లాట్ కేటాయిస్తామని చెప్పిన సొసైటీ నేతలు దాన్ని పక్కన పెట్టి తమ సొంత వారికి ప్లాట్ తీయించారు. దీనిపై 30.06.2023న డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశాను. ఇందులో కూడా న్యాయం జరగలేదు. ప్రస్తుతం రిటైర్డ్ అయ్యాను.

*-ఎం.రోసిలిన్, పులివెందుల.*

### బైలాలో ఉంది..

భూమి కొన్న సమయంలో అమ్మిన వారు కూడా ప్లాట్లు ఇవ్వాలని కోరారు. అమ్మిన వారికి కూడా ప్లాట్లు ఇవ్వొచ్చని బైలాలో ఉంది. ఆ ప్రకారమే ప్లాట్లు ఇచ్చాం.

*-గురుప్రసాద్, కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు, పులివెందుల తాలూకా.*

# ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

● ఇన్‌చార్జ్ కమిషనర్ రాకేశ్‌చంద్రన్


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ కమిషనర్ రాకేశ్‌చంద్రన్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 5 : క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలు పరిశీలించి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఇన్‌చార్జ్ కమిషనర్ జె.రాకేశ్‌చంద్రన్ పేర్కొన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్జీలన్నీ పరిశీలించి సంబంధిత అధికారులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారవేదికకు 26 అర్జీలు వచ్చాయన్నారు. వాటన్నింటినీ పరిశీలించి సం బంధిత అధికారులకు పంపించామన్నారు. అలాగే క్షేత్రస్థాయిలో వాటన్నింటినీ పరిశీలించి సమస్యలు త్వరిగతిన పరిష్కరించాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించినట్లు తెలపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## 'విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి'


వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 5 : విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని పీఆర్‌ఎస్ వైఎఫ్ జిల్లా కన్వీనరు ఓరుగంటి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. సోమవారం డీఆర్వోకు ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకునే హాస్టల్స్‌లో వార్డెన్లు విధులపట్ల ఇనర్లక్ష్యం వహిస్తూ విద్యార్థులకు ఇబ్బందికరగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, చిన్నా పాల్గొన్నారు.

## రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 5: కడప జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర మాట్లాడుతూ కృష్ణ, గోదావరి నదీ జలాల వివాదంలో రాష్ట్రానికి నష్టం జరగకుండా చూడాలన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ సుబ్బారెడ్డి, పోలిరెడ్డి భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మనోహర్ రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, డీహెచ్‌పీఎస్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొని మాట్లాడారు. వర్షాభావం వల్ల వేరుశనగ, పత్తి, మినుము తదితర పంటలు ఎండిపోతున్నాయన్నారు. వ్యవసాయాధికారులు తక్షణం క్షేత్రస్థాయిలో పర్యటన చేసి నష్టపోతున్న రైతాంగానికి సాయం చేసే విధంగా ప్రభుత్వానికి నివేదికలు పంపాలన్నారు.

## జనసేన సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన

● సుంకర శ్రీనివాస్


జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న సుంకర శ్రీనివాస్

కడప (సెవెన్‌రోడ్స్),ఆగస్టు 5: జనసేన సభ్యత్వనమోదు కార్యక్రమానికి అనూహ్యస్పందన లభిస్తోందని జనసేన కడప నియోజకవర్గం కో ఆర్డినేటర్ సుంకర శ్రీనివాస్ పేర్కొన్నారు. గత నెల 18 నుంచి ఈనెల 5 వరకు 19 రోజులపాటు సభ్యత్వనమోదు ప్రక్రియ కొనసాగిందన్నారు. చివరి రోజైన సోమవారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని గంగమ్మ గుడి సమీపంలో జనసేన నాయకులు జీవీ రమణ సారథ్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సుంకర శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కడప నియోజకవర్గంలో సుమారు 4 వేల పైచిలుకు సభ్యత్వం నమోదైందన్నారు. తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా సభ్యత్వనమోదు ప్రక్రియ చేపట్టామన్నారు. జనసేన నాయకుడు జి.వి.రమణ మాట్లాడుతూ పార్టీ అధినేత ఆదేశాల మేరకు 9వ డివిజన్‌లో సుమారు 1000కి పైగా సభ్యత్వం నమోదైందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రామకృష్ణ, నరేంద్ర, చలపతి, రాజు, సుబ్రమణ్యం టి. నాగరాజు, అశోక్, ఆవుల ఓబులేసు, రవీంద్రబాబు, వీరమహిళలు, లావణ్య, శశిరేఖ, లహరి, పలువురు జనసైనికులు తదితరులు పాల్గొన్నారు

## రేపు సర్వసభ్య సమావేశం

వీరపునాయునిపల్లె, ఆగస్టు 5: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 7న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10గంటలకు ఉంటుందని, ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కృష్ణచైతన్యకుమార్‌రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు.కావున అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

## 'మా పొలంలో అక్రమంగా మట్టి తవ్వారు.. న్యాయం చేయండి'


కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన గొడుగునూరు గ్రామ దళిత మహిళలు

కడప(కలెక్టరేట్), ఆగస్టు 5: మా పట్టా భూమిలో అనుమతి లేకుండా మట్టి తవ్వి అమ్ముకోవడమే కాకుండా, అడిగినందుకు దూషిస్తూ భయ భ్రాంతులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బద్వేలు మండలం పట్టాయపల్లి పంచాయతీకి చెందిన గొడుగునూరు దళిత మహిళలు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు కడపకు వచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టాయపల్లి పంచాయతీ సర్వే నెంబరు 372-4 ఖాతా నెంబరు 305లో 1.50 ఎకరాల పట్టాభూమి పాణ్యం పుల్లయ్య పేరున ఉందన్నారు. అయితే అదే గ్రామానికి చెందిన అగ్రకులానికి చెందిన లక్ష్మీదేవి, పెంచలరెడ్డి, రామసుబ్బమ్మ మా పొలంలో 40 అడుగుల పొడవు, 10 అడుగుల లోతున గుంతలు తీసి మట్టిని అమ్ముకున్నారని ఆరోపించారు. మట్టి తవ్వినవారిని ప్రశ్నిస్తే దూషిస్తూ, దాడులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మీ చేతనైంది చేసుకోండం టూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. మట్టి అక్రమ తవ్వకాలపై నీటి పారుదల శాఖ, పంచాయతీరాజ్, అధికారులకు మొరపెట్టుకున్నా కనికరించలేదన్నారు. మా భూమిని సర్వే చేయించి, గుంతలు పూడ్చేలా చర్యలు తీసు కుని, దౌర్జన్యంగా తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు.

## రామాలయాన్ని పరిరక్షించాలని బీజేపీ వినతి


గండి ఏసీకి వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నేతలు

చక్రాయపేట, ఆగస్టు 5: గండి క్షేత్రం సమీపంలో కొండపై వెలసిన రామాలయాన్ని పరిరక్షించాలంటూ బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గండి దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం సమర్పించారు. రామాలయం సమీపంలో ఎదురుగా ఖాళీస్థలం ఉండటంతో శ్రావణమాసోత్సవాలలో గండి దేవస్థానం వారు షాపులకు స్థలాన్ని కేటాయించి డబ్బు వసూలు చేసేవారన్నారు. కాగా ఆ స్థలాన్ని రామాలయానికి కేటాయించి, ఆ షాపుల వల్ల వచ్చే ఆదాయాన్ని రామాలయం దూపదీప నైవేద్యాలకు సమకూరుతుందని, అర్చకులకు పారితోషికం ఇవ్వవచ్చన్నారు. కావున స్థలాన్ని రామాలయానికి ఇవ్వాలని కోరారు. అందుకు సహాయ కమిషనర్ స్పందించి పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.ఆ ఖాళీ స్థలంలో అంగళ్లు ఉంచడం వల్ల కొంత ఆదాయం వస్తుందని, ఆ ఆదాయం రామాలయానికి వచ్చేలా చూడాలని కోరారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, బీజేవైఎం రాష్ట్రకార్యవర్గ సభ్యులు సునీల్, సుమన్, మహిళా మోర్చా నాయకురాలు విజయలక్ష్మి, సీనియర్ నాయకులు లక్ష్మీరెడ్డి, వేంపల్లె మండలాధ్యక్షుడు ప్రసాదరెడ్డి, బీజేవైఎం జిల్లా వైస్‌ప్రెసిడెంట్ సోము దశరథరాయల్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ సీనియర్ నేత దావీదు మృతి

పెండ్లిమర్రి, ఆగస్టు 5: సీపీఐ సీనియర్ నేత, వ్యవసాయ కార్మిక సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ ఎం.వెంకటసుబ్బయ్య (దావీదు) (90)కి మృతి చెందారు. ఆయన మృతికి సీపీఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర మాట్లాడుతూ పాతకాలం కమ్యూనిస్టులైన ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి, జె.వెంకటరామిరెడ్డి, ఎం.శివరామిరెడ్డిలతో పాటు సీనియర్ కమ్యూనిటస్టు నేతల ప్రోత్సాహంతో సుదీర్ఘకాలం నియోజకవర్గంలో పేద బడుగు బలహీన వర్గాల కోసం కుటుంబాన్ని సైతం త్యాగం చేసిన ఘనత కామ్రేడ్ వెంకటసుబ్బయ్యకే దక్కు తుందన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఓబులేసు సంతాపం తెలిపారు. కమలాపురం ఏరియా కార్యదదర్శి చంద్రశేఖర్ తదితర సీపీఐ నాయకులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

## ఆదర్శ కళాశాలగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్సీకి వినతి


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

చక్రాయపేట, ఆగస్టు 5: మండల కేంద్రమైన చక్రాయపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లాలోనే ఆదర్శ కళాశాలగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ రంతుబాష ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు పంపిణీ కార్యక్రమం చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చిన పుస్తకాలను ఎమ్మెల్సీ చేతులమీదుగా పంపిణీ చేశారు. అనంతరం రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలిగి పెద్దలను గౌరవించి పూర్తిస్థాయిలో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని కోరారు. పాఠశాలలో కొత్త భవనం నిర్మించారని, ఆ భవనంలో ఫర్నిచర్ లేదని ప్రిన్సిపాల్ రంతుబాష తెలియజేయగా, తన సొంత నిధులతో ఫర్నిచర్‌ను, వేంపల్లె నారాయణ స్కూల్ కరస్పాండెంట్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మరికొంత మొత్తం సమకూర్చుతామని రామగోపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. ల్యాబ్, బస్ సౌకర్యం సక్రమంగా లేదని, వేంపల్లె నుంచి చక్రాయపేటకు రావాలంటే గంట సమయం పడుతోందని, దీంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు కూడా అధ్వానంగా ఉందన్నారు. కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని కోరారు. విద్యాశాఖ మం త్రి దృష్టికి తీసుకెళ్తానని వారికి తెలిపారు. మాజీ ఎంపీటీసీ జీవీ రమణ, కావలి భానుకిరణ్, మాధవరెడ్డి, పోతిరెడ్డి శివ, మహేశ్వర్, అధ్యాపకులు అనంత్ సాగర్, ధనుంజయ, ఆదిలక్ష్మి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సేవలో కృషి విజ్ఞాన కేంద్రాలు


డ్రోన్‌తో పోషకాల పిచికారీ గురించి రైతులకు వివరిస్తున్న అధికారులు

సీకేదిన్నె, ఆగస్టు 5: రైతు సేవలో కృషి విజ్ఞాన కేంద్రాలు విజయవంతంగా పనిచేస్తున్నాయని కేవీకే సమన్వయకర్త వీరయ్య, ఏరువాక కేంద్రం సమన్వయకర్త అంకయ్య, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసాచారిలు తెలిపారు. కృషి విజ్ఞానకేంద్రం ఊటుకూరు నందు కృషి విజ్ఞాన స్వర్ణోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవీకేలకు 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భారత వ్యవసాయ పరిశోధన మండలి కృషి విజ్ఞాన కేంద్రాల స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రపరిశీలనలు నిర్వహించడం, రైతు, మహిళల, యువకుల వ్యవసాయ అనుబంధ రంగాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, చదువుకున్న నిరుద్యోగులకు ఆదాయం అందించే వివిధ వృత్తుల్లో అవగాహన కల్పించి శిక్షణ తరగతులు నిర్వహించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, మొక్కలు, వర్మీకంపోస్టు కూరగాయలు, పండ్లు, పుట్టగొడుగులు, చిరుధాన్యాలతో చేసిన నిలువ ఆధారిత ఉత్పత్తులు, ముఖ్యమైనవన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా కొత్త వంగడాలు తీసుకొచ్చామ న్నారు. వ్యవసాయ ఉప సంచాలకులు సి.వి.రమణారెడ్డి, ఆత్మ ఏపీడీ పద్మావతి, కృషి విజ్ఞాన కేంద్రాల ఆవశ్యకతను, రైతులకు, నిరుద్యోగులకు అందించే సేవలను వివరించారు. కార్యక్రమంలో డ్రోన్ ఆవశ్యకత, కలుపుమొక్కల నివారణ, పోషకాల పిచికారీ, తదితర అంశాలను రైతులకు వివరించారు. వనిపెంట కేవీకే సమన్వయకర్త బాలకృష్ణ, శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, ప్రశాంతి, శిల్పకళ, మహేష్‌బాబు, సాయిమహేశ్వరి, మానస, సురేష్‌కుమార్‌రెడ్డి, మాధురి పాల్గొన్నారు.



## జీఓ 77ను రద్దు చేయాలి: ఏబీవీపీ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 5 :జీఓ 77ను రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లిఖార్జున డిమాండ్ చేశారు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే జీఓ 77ను రద్దు చేస్తామని యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చిన ప్రస్తుత మంత్రి నారాలోకేశ్ మాట మారుస్తున్నారన్నారు. జీవో 77ను వెంటనే రద్దు చేసి ప్రైవేటు కళాశాలల్లో పీజీ చదివే విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్ ఇవ్వాలని, ఐసెట్ కౌన్సిలింగ్ షెడ్యూలు రద్దు చేసి కొత్త షెడ్యూలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ మంత్రి పర్యటనలు అడ్డుకుంటామని హెచ్చరించారు. జిల్లా కన్వీనర్ ఎం.మాణిక్యరాజు, అనిల్, రెడ్డిసాయి, చరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సూత్రాలు పాటించండి

పులివెందుల రూరల్, ఆగస్టు 5: ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ఆరోగ్య సూత్రాలు పాటించాలని తొండూరు మండల వైద్యాధికారి డాక్టర్ రేష్మ ప్రజలకు సూచించారు. సోమవారం తొండూరు మండలంలోని బూచుపల్లె గ్రామంలో 104 సేవల శిబిరాన్ని పర్యటించారు. ఇంటింటిని పరిశీలించారు.

లార్వా ఉన్న నీటి నిల్వలను పారబోయించారు. పలుచోట్ల అబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. దోమల వలన ప్రబలే వ్యాధులను వవరించారు. డ్రైడేపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ సాయిదివ్య, ఆరోగ్య కార్యకర్తలు వీరాంజనేయులు, మంజుల, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కడప తహసీల్దారుగా నారాయణరెడ్డి బాధ్యతల స్వీకరణ



కడప(కలెక్టరేట్), ఆగస్టు 5: కడప తహసీల్దారుగా ఎంబీఎస్ నారాయణరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ కడప మండల ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు ముఖ్యం త్రి చంద్రబాబు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన పేదలందరికీ అందేలా చూ స్తానన్నారు. కాగా ఆయన జిల్లాలో కలసపాడు, కమలాపురం, చింతకొమ్మదిన్నె, ఖాజీపేటమండలాలతో సంబేపల్లిలో తహసీల్దారుగా పని చేశారు.

## కమలాపురం నూతన తహసీల్దారుగా శివరాంరెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న శివరామిరెడ్డి

కమలాపురం రూరల్, ఆగస్టు 5 : కమలాపురం తహసీల్దారుగా బి.శివరామిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కడపలో పనిచేస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా అనంతపురం జిల్లా బదిలీ అయ్యారు. అక్కడి నుంచి కమలాపురం వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.



## యోగా ద్వారా ఏకాగ్రత పెరుగుతుంది


యోగాపై అవగాహన కల్పిస్తున్న శేషారెడ్డి.. హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు

సీకేదిన్నె, ఆగస్టు 5: యోగా ద్వారా విద్యార్థులకు ఏకాగ్రత పెరిగి వారు ఉన్నత భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతుందని పిరమిడ్ యోగా ధ్యాన పరిశోధన కేంద్రం వ్యవస్థాపకులు జీవీ శేషారెడ్డి తెలిపారు. స్థానిక రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు యోగా, ధ్యానంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యోగా చేయడం వలన పాజిటివ్ థింకింగ్ పెరిగి జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, క్రమశిక్షణ, అంకితభావం పెరుగుతాయన్నారు. ప్రతిరోజు యోగాను క్రమం తప్పకుండా చేయడం ద్వారా మానవ శారీరక, మానసిక దృఢతలు కలుగుతాయని, గట్టి పట్టుదల, నిబద్ధత, సంకల్పం పెరుగుతాయని వాటి వలన విద్యార్థులు చదువులో ముందుంటారన్నారు. ధ్యానం, యోగాసనాలు ఆరోగ్యానికి శాసనాల్లాగా చక్కగా ఉపయోగపడుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వివిధ రకాల ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి, ఏవో రామసుబ్బారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే మాధవి


ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే మాధవి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 5 : కడప నియోజకవర్గంలో ప్రజలు ఇచ్చే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆర్. మాధవి అన్నారు. సోమవారం ద్వారకనగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రజలు ఇచ్చిన వినతులు ఆమె స్వీకరించారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈకార్యక్ర మంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం

● చిన్నచౌకు సీఐగా బాధ్యతలు స్వీకరించిన తేజ్‌మూర్తి


సీఐగా బాధ్యతలు స్వీకరించిన తేజ్‌మూర్తి

కడప (క్రైం), ఆగస్టు 5: చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ ఎస్.తేజ్‌మూర్తి పేర్కొన్నారు. చిన్నచౌకు సీఐగా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి, మట్కా, క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, పాత నేరస్తులపై నిఘా ఉంచుతామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు నేరాల నియంత్రణకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

**సీఐ నేపథ్యం...** అన్నమయ్య జిల్లా గాలివీడుకు చెందిన తేజ్‌మూర్తి 2002 బ్యాచ్‌కు చెందినవారు. తాడిపత్రిలోని పెద్దపప్పూరు పోలీసుస్టేషన్‌లో మొదటిసారిగా విధులు నిర్వహించారు. అనంతపురం జిల్లాలోని పలు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహించారు. 2017లో సీఐగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఆదోని వన్‌టౌన్ నుంచి బదిలీపై కడప చిన్నచౌకుకు వచ్చారు.

## వీల్ చైర్ వికలాంగులకు పెన్షన్ రూ.15 వేలకు పెంచాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసేందుకు వచ్చిన వికలాంగులు

కడప(కలెక్టరేట్), ఆగస్టు 5: వీల్‌చైర్‌కే పరిమితమైన వికలాంగులకు పెన్షన్ రూ.6 వేల నుంచి 15 వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య యాదవ్, జిల్లా అధ్యక్షుడు డి.మాతయ్య డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్‌కు వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా మంది వికలాంగులకు ఇంటి స్థలాలు లేవన్నారు. వారందరికీ ఇళ్ల స్థలాలివ్వాలని, అలాగే శారీరక వికలాంగులకు రోస్టర్ పాయింట్స్ టాప్‌టెన్ లో పెట్టాలని, బ్లాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ఆర్టీసీలో ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. ఈ మేరకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా నాయకులు ఆంజనేయరెడ్డి, బాబు, మల్లేశ్వరి రాజా, బాషా తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్

## ఉద్యోగులపై రాజకీయ వేధింపులు అరికట్టాలి: సీఐటీయూ


ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

కడప (నాగరాజుపేట), ఆగస్టు 5 : స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై రాజకీయ వేధింపులు అరికట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీలో భాగంగా కడప జిల్లా కలెక్టరు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ స్కీం వర్కర్లు, యానిమేటర్లు, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులపైన రాజీకయ వేధింపులు ఆపాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఫీల్డ్‌అసిస్టెంట్లు, డ్వాక్రాలో పనిచేసే యానిమేటర్లు, ఆర్పీలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వంట మనుషులు అంగన్వాడీలో ఆయాలు, స్వీపర్లు, వాచ్‌మెన్లపై రాజకీయంగా ఒత్తిడి తెచ్చి వారి చేత బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారన్నారు. దీనికి వ్యతిరేకంగా సీఐటీయూ ఆందోళన చేస్తోందన్నారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన తదితర కార్మికులను తొలగించవద్దన్నారు. అనంతరం నగర కార్యదర్శి సుబ్బయ్య, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి విజయకుమార్ మాట్లాడారు. ధర్నా అనంతరం స్పందనలో డీఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. రాజకీయ వేదింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్రకుమార్‌వచ్చి ఉద్యమానికి సంఘీభావం తెలిపి మద్దతు పలికారు. కార్యక్రమంలో గోపి, తిరుపాల్, సుంకర రవి, కిరణ్, అంజలీదేవి పాల్గొన్నారు.

## గండి దేవస్థానంలో అక్రమాలపై విచారణ జరిపించాలి: టీడీపీ


మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి

వేంపల్లె, ఆగస్టు 5: గండి దేవస్థానంలో ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయని, వెంటనే విచారించి చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి, గండి దేవస్థాన మాజీ చైర్మన్ వడ్లకుంట రాజారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం వేంపల్లె టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది గండి శ్రావణమాసోత్సవాల ఆహ్వాన పత్రికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, దేవదాయ శాఖ మంత్రి ఫోటోలను వేయకుండా ముద్రింపజేసి పంచిపెట్టారని, ఇది ప్రోటోకాల్ ఉల్లంఘన అన్నారు. దీనికి బాధ్యతలైన అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో పనిచేసిన ఈఓ అన్నదానం కోసం రూ.4కోట్లు సేకరించారని, ఆ నిధులు ప్రస్తుత అధికారి దుర్వినియోగం చేస్తారనే ఆందోళన ఉందన్నారు. పనిచేస్తున్న పూజారి రూ.20లక్షలు ఖర్చుపెట్టి గతంలో ఉన్న అసిస్టెంట్ కమిషనర్‌ను బదిలీ చేయించి ప్రస్తుతం ఉన్న అధికారిని వేయించుకున్నారన్నారు. హారతిపళ్లెంలో లక్షలాది రూపాయలు వస్తాయని, అవి దేవస్థానానికి చేరడం లేదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల మాజీ కార్యదర్శి పాపిరెడ్డి, బీసీ సంఘం నాయకులు మడక శ్రీనివాసులు, నామా వేమకుమార్, జగదీష్ పాల్గొన్నారు.

## పులివెందుల తహసీల్దార్‌గా నజీర్ అహ్మద్


బాధ్యతలు చేపట్టిన నజీర్ అహ్మద్

పులివెందుల టౌన్, ఆగస్టు 5: పులివెందుల తహసీల్దార్‌గా ఎ.ఎస్.నజీర్ అహ్మద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రొద్దుటూరు తహసీల్దార్‌గా పనిచేస్తుండేవారు. ఎన్నికల నిమిత్తం నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు వెళ్లి ప్రస్తుతం బదిలీపై పులివెందుల తహసీల్దార్‌గా నియమితులయ్యారు. నజీ ర్ అహ్మద్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించే దిశగా ముందు కెళతామన్నారు. భూ సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్, ఎన్నికల డీటీ జగదీష్, కరిముల్లా, మోరే, ఆర్‌ఐలు కృష్ణమోహన్, సుజిత్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లింగాల, ఆగస్టు 5: మండలంలోని అంబకపల్లె, హిరోజిపురం సబ్‌స్టేషన్‌ల పరిధిలో మంగళవారం ఉయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ ఉండదని విద్యుత్ ఏఈ రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో మెయింటెనెన్స్ కారణంగా ఈ అంతరాయం ఉంటుందని తెలిపారు.

## చౌటిపల్లెలో పీర్ల ఊరేగింపు



కొండాపురం, ఆగస్టు 5: మండలంలోని చౌటిపల్లె గ్రామంలో సోమవారం తెల్లవారుజామున పీర్లను ఊరేగించారు. జాతరపీర్ల పండుగలో భాగంగా ఆదివారం అర్ధరాత్రి పీర్లు అగ్నిగుండ ప్రవేశం చేశాయి. అనంతరం మేళతాళాలతో పీర్లను గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## పంట నమోదుతో రైతుకు ప్రయోజనం

ప్రొద్దుటూరు , ఆగస్టు 5 : ఖరీఫ్ సీజన్లలో పంటలు సాగుచేసే ప్రతిరైతు పంటనమోదు చేసుకుంటేనే ప్రయోజనం చేకూరుతుందని సహాయ వ్యవసాయ సంచాలకుడు సురేష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉప్పరపల్లె గ్రామంలో పంటనమోదు ప్రక్రియను సహాయ వ్యవసాయ సంచాలకుడు సురేష్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శివశంకర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ హరీంద్ర, వీఆర్వో జహరుద్దీన్ పాల్గొన్నారు.

## మంచినీటి పైపులు ఏర్పాటు చేయండి

బద్వేలు, ఆగస్టు 5: పట్టణంలోని సుందరయ్య కాలనీకి మంచినీటిపైపులైన్లు ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆ పార్టీ పట్టణ నాయకులు చిన్ని మాట్లాడుతూ కాలనీ ఏర్పడి దాదాపు 25 సంవత్సరాలు కావస్తున్నదని, అలాగే అక్కడ 100 కుటుంబాల వరకు నివాసం ఉంటున్నారన్నారు. నేటికి ఆ ప్రాంతాల వారికి తాగేందుకు నీరు లేక బోర్ల వద్ద నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆంజనేయులు, మోక్షమ్మ, రామలక్షుమ్మ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## రక్తహీనత అనారోగ్యానికి మూలం

బద్వేలు రూరల్, ఆగస్టు 5 : రక్తహీనత వల్ల అనారోగ్యానికి మూలమై అనేక జబ్బులు వచ్చే అవకాశం ఉందని తొట్టిగారిపల్లె వైద్యాధికారి వినయకుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అనంతరాజపురం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు రక్తపరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి పోషకల విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. గుడ్డు, పాలు ఆకుకూరలు, మాంసాలను తప్పనిసరిగా తీసుకోవాలని ప్రతి విద్యార్థి పరిశుభ్రంగా ఉండాలన్నారు. ప్రతి వారం ఐరన్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, సీహెచ్‌వో శిరీషా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, వైద్యసిబ్బంది జనార్ధనరావు, స్వాతి, వాణి పాల్గొన్నారు.



# అధ్వానంగా గ్రామీణ రహదారులు

**దమ్మనపల్లె రోడ్డుకు మోక్షమెప్పుడు..? ● ముద్దంవారిపల్లె బ్రిడ్జి పూర్తయ్యేదెప్పుడు..? ● అవస్థలు పడుతున్న జనం**

పోరుమామిళ్ల, ఆగస్టు 5 : అన్ని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం, రూపురేఖలు మారుస్తామని గత ప్రభుత్వం చెప్పిన హామీలు హామీలకే పరిమితమయ్యాయి. నిధులు విడుదల చేయకుండా పనులు మాత్రం టెండర్లకు పిలవడంతో చేసిన పనులకు బిల్లులు రాక గత ప్రభుత్వ వైఖరిని తిట్టుకుంటూ తమ పరిస్థితికి చింతిస్తూ పనులు నిలిపివేయడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు రహదారులు సౌకర్యం సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో స్పెషల్ ప్యాకేజీ కింద పోరుమామిళ్ల మండలానికి సంబంధించి దమ్మనపల్లె పంచాయతీకి ప్రధాన రహదారి నుంచి దమ్మనపల్లె వరకు నాలుగుకి.మీ పొడవునా



అసంపూర్తిగాఉన్న ముద్దంవారిపల్లె బ్రిడ్జి నిర్మాణం



అధ్వానంగా ఉన్న దమ్మనపల్లె రహదారి

సుమారు 74లక్షల వ్యయంతో మార్కెటింగ్ కమిటీకి సంబంధించి నిధులు మంజూరు చేసింది. కానీ అందుకు సంబంధించి గ్రాంటు లేకపోవడంతో పనులు ప్రారంభించలేదు. ఈ పంచాయతీ సంబంధించి దమ్మనపల్లె, సుంకేసులపల్లె, చౌటపాలెం, ఎస్సీకాలనీ సంబంధించి ఈ రహదారులు వేయాల్సి ఉంది. కానీ చాలా ఏళ్లుగా పెండింగులో పెట్టి అది చేస్తాం, ఇది చేస్తామని కాకమ్మ కబుర్లతో నాటి పాలకులు కాలం వెలిబుచ్చారే తప్ప ఆయా గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించలేదు. దీంతో అతుకుల గతుకుల రోడ్డులోనే ఆ గ్రామస్థులు ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలాసార్లు గుంతల్లో పడిన దాఖలాలు ఉన్నాయి. కానీ ఇంత వరకు దానిని పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. రాష్ట్రప్రభుత్వంలో అయినా తమ ప్రాంతఆలకు రహదారుల సౌకర్యంకల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆయా ప్రాంతాల నుంచి విద్యార్థులు పోరుమామిళ్లకు రావాలన్నా చుట్టూ తిరుగి వెళ్లాల్సి ఉంటుంది. పాత రోడ్డులో వెళ్లాలంటే ఆచి తూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి. సుంకేసులపల్లె వరకు మెయింటెనెన్స్‌వర్క్ చేశారు. అలాగే రజాసాహెబ్‌పేట నుంచి సిద్దవరం వరకు 2 కోట్ల వ్యయంతో తారురోడ్డుకు బిల్లు విడుదల అయినా ఆ పనులు కూడా అలాగే ఉండిపోయాయి. ఆ రహదారి గనుక వేసి ఉండింటే రజాసాహెబాపేట నుంచి సిద్దవరానికి రైతులు పొలాల్లోకి వెళ్లడానికి వీలుగా ఉంటుందని భావిస్తే అది కలగానే మారిపోయింది. ఎస్‌వెంకటాపురం పరిధిలోని ముద్దంవారిపల్లెలో కోటి రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టినా వాటికి సంబంధించిన బిల్లులు కూడా గత ప్రభుత్వం చెల్లించకపోవడంతో పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ప్రస్తుతం వర్షాకాలంలో ఆ గ్రామస్థులు ప్రధాన రహదారికి రావాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఆ ప్యాకేజీకి సంబంధించి సంచర్ల చెన్నారెడ్డిపేట నుంచి పుల్లీడు వరకు రామాయపల్లె నుంచి చెరువుకట్ట వరకు చెరువుకట్ట మీదుగా తారురోడ్డు మాత్రం వేశారు. ఈ పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రభుత్వమైనా స్పందించి గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలు గుర్తించి కొత్తగా రహదారులకు నిధులు కేటాయించి రహదారుల నిర్మాణం చేపట్టి ప్రజల సమస్యలను తీర్చాలని కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత శాఖ డీఈ అమర్‌నాథ్‌ను వివరణ కోరగా పది నెలలుగా కాంట్రాక్టరుకు బిల్లులు రాకపోవడంతో అలాగే నిలిపివేశారన్నారు. చెన్నారెడ్డిపేట నుంచి పుల్లీడు వరకు బీటీరోడ్డు, రామాయపల్లె నుంచి పోరుమామిళ్ల చెరువుకట్ట మీదుగా తారురోడ్డు, సంచర్లలో మాత్రం రోడ్డు పనులు జరిగాయన్నారు. ఈ పెండింగులో ఉన్న పనులకు బిల్లులు రావాల్సి ఉందని ఆ బిల్లులు వస్తే కాంట్రాక్టర్లు తిరిగి పనులు చేస్తామని అంటున్నారని ఆయన తెలిపారు.

## ఎస్ఎంసీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 5: ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్ఎంసీ ప్రొద్దుటూరు డివిజన్ కో-ఆర్డినేటర్ దశరథ రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు 8వ తేదీ నిర్వహించే ఎస్ఎంసీ ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎంసీ ఎన్నికలకు ప్రతి తరగతి నుంచి ముగ్గురి సభ్యులను ఎన్నుకోవాలని, ఎస్సీ, ఎస్టీ నుంచి ఒకరు, బీసీ నుంచి ఒకరు, ఓసీ నుంచి ఒకరిని ఎన్నుకోవాలన్నారు. 1, 2 తరగతులు ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఆరుగురిని, 1 నుంచి 5 తరగతులు ఉన్న ప్రాథమిక పాఠశాలలో 15 మందిని, యూపీ పాఠశాలలో 21 మందిని, 1 నుంచి 8 తరగతులు ఉన్న యూపీ పాఠశాలలో 24 మందిని, ఉన్నత పాఠశాలలో 15 మందిని, 3 నుంచి 10 తరగతులు ఉన్న పాఠశాలలో 24 మందిని ఎన్నుకోవాలన్నారు. సభ్యులలో ఎక్కువ మంది మహిళలు ఎన్నికయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల రోజు సమస్యలు ఏవైనా ఉత్పన్నం అయితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సావిత్రమ్మ, ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు భాస్కర్, రమాదేవి, గాయత్రి, ఎలీనా తదితరులు పాల్గొన్నారు.

## పూడిక తీత పనులు త్వరగా చేపట్టండి : ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు, ఆగస్టు 5 : పట్టణంలోని ప్రధాన మురికి కాలువల్లో పూడికతీత పనులు త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇంజీరింగ్ శానిటరీ టౌన్‌ప్లానింగ్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం కాలువల్లో పూడిక తీత పనులకోసం మంజూరు చేసిన 1.21 కోట్లపనులకు టెండర్లు పూర్తిఅయ్యాయా పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని అధికారులను ప్రశ్నించారు. అక్రమ కట్టడాలపై చర్యలకు ఏం ప్రణాళికలు రచించారని ప్రశ్నించారు. మున్సిపల్ స్థలాల్లోని ఆక్రమ కట్టడాలపై త్వరితగతిన చర్యలు తీసుకుని స్వాధీనం చేసుకోవాన్నారు. సమావేశంలో కమిషనర్ రఘునాథరెడ్డి, ఈఈ సాయిక్రిష్ణ, డీఈలు, ఏఈ లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

## రీ సర్వేపై సమీక్ష సమావేశం

జమ్మలమడుగు, ఆగస్టు 5: జమ్మలమడుగు మండలంలో గతంలో జరిగిన రీసర్వే రికార్డుల విషయంలో ఆయా గ్రామాల్లో జరిగిన సర్వేలపై సోమవారం కొత్తగా వచ్చిన తహసీల్దారు శ్రీనివాసరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దారు కార్యాలయ సిబ్బందితో మాట్లాడారు. జమ్మలమడుగులోని 14 గ్రామ పంచాయతీలు 28 గ్రామాల వీఆర్వోలు, తహసీల్దారు సిబ్బందితో సమీక్ష సమావేశంలో వివిధ సమస్యలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నాటుసారా పట్టివేత

మైలవరం, ఆగస్టు 5 : నాటుసారాను అక్రమంగా అమ్ముతున్న ఇద్దరి వ్యక్తులను సోమవారం అరెస్టు చేసినట్లు తలమంచిపట్నం ఎస్ఐ హనుమంతు తెలిపారు. పెద్దకొమెర్ల గ్రామానికి చెందిన ఇస్సాక్, నంద్యాల జిల్లా అవుకు మండలం కొండనాయునిపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ పెద్ద కొమెర్ల గ్రామ సమీపాన అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 1000 నాటుసారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు.

## కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

బద్వేలు, ఆగస్టు 5: బద్వేలు మండలంలోని సి. కొత్తపల్లెలో కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకోవడంతో పాటు మహిళపై దాడిచేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముందుగా ఆ సంఘంవారు పట్టణంలోని మార్కెట్‌యార్డు నుంచి పేదలతో కలిసి తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చారు. అనంతరం తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అన్వేష్ వెంకటేష్, మండల నాయకులు రమణ, రవిచంద్ర, రామ్మోహన్, దుర్గమ్మ పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

## 'మా పొలంలో అక్రమంగా మట్టి తవ్వారు.. న్యాయం చేయండి'

కడప(కలెక్టరేట్), ఆగస్టు 5: తమ పట్టా భూమిలో అనుమతి లేకుండా మట్టి తవ్వి అమ్ముకోవడమే కాకుండా, అడిగినందుకు దూషిస్తూ భయ భ్రాంతులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బద్వేలు మం డలం పుట్టాయపల్లి పంచాయతీకి చెందిన గొడుగునూరు దళిత మహి ళలు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టాయపల్లి పంచాయతీ సర్వే నెంబరు 372-4 ఖాతా నెంబరు 305లో 1.50 ఎకరాల పట్టాభూమి పాణ్యం పుల్లయ్య పేరున ఉందన్నారు. అయితే అదే గ్రామానికి చెందిన అగ్రకులానికి చెందిన లక్ష్మీదేవి, పెంచలరెడ్డి, రామసుబ్బమ్మ గుంతలు తీసి మట్టిని అమ్ముకున్నారని ఆరోపించారు. మట్టి తవ్విన వారిని ప్రశ్నిస్తే దూషిస్తూ, దాడులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మట్టి అక్రమ తవ్వకాలపై నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్, అధికారులకు మొరపెట్టుకున్నా కనికరించలేదన్నారు. భూమిని సర్వే చేయించి, గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకుని, దౌర్జన్యంగా తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన గొడుగునూరు గ్రామ దళిత మహిళలు

## గుడిఆక్రమణను పరిశీలించిన ఆర్డీవో

అట్లూరు, ఆగస్టు 5 : మండలంలోని సోమేశ్వరపురం వద్ద ఆంజనేయస్వామి గుడికి కంచె వేసి ఆక్రమించుకున్నారంటూ సోమేశ్వరపురం ఎస్సీకాలనీకి చెందిన సంగటి సుబ్బయ్య ఫిర్యాదు మేరకు బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. 1985లో అప్పటి భూపట్టాదారుడు నరసింహారెడ్డి సర్వే నెంబరు 390/2లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో మూడు సెంట్లు స్థలం గుడికి దానం ఇవ్వడంతో గుడి నిర్మాణం చేయడం జరిగిందన్నారు. నరసింహారెడ్డి భూమిని దుంపల లక్ష్మీదేవి, దుంపల గంగాదేవికి విక్రయించారు. దీంతో వారు గుడికి కేటాయించిన మూడు సెంట్లు గుడిని కూడా ఆన్‌లైన్ చేయించుకున్నారని గుడి చుట్టూ భక్తులను తిరగనీయకుండా గుడికి అర్ధభాగం స్తంభాలు పాతి కంచె వేసి ఆక్రమించుకోవడం జరిగిందన్నారు. స్పందనలో నెల రోజులక్రితం ఫిర్యాదు చేయగా ఆర్డీవో శనివారం పరిశీలించి గుడి చుట్టూ కంచె తీయించి మూడు అడుగులు గుడి వెలుపల భాగాన్ని కంచె వేయించాలని అట్లూరు తహసీల్దారుకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వెంకటసుబ్బమ్మ, సర్వేయరు నరసింహారెడ్డి ఉన్నారు.

## పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహించిన వారికి షోకాజ్ నోటీసు

బి.కోడూరు, ఆగస్టు 5 : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పడ్డాక పింఛన్ల పంపిణీలో గట్టి చర్యలు తీసుకుంది. అయితే పింఛన్ల పంపిణీలో కొంత మంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని కలెక్టరు శివశంకర్, జిల్లా పరిషత్ సీఈవోకు తెలపడంతో ఆయన ఆదేశాల మేరకు ఎంపీడీవో భాస్కర్‌రావు మున్నెల్లి గ్రామానికి పింఛన్ల పంపణీ నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బంది వేదవ్యాస్, హరీష్‌రెడ్డి, సృజన, నిఖిలేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావుకు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారు తదుపరి ఎంపీడీవో కార్యాలయంలో వివరణ తెలుపుకోవాలని వారన్నారు.



## తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 5: తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం స్త్రీశక్తి భవన్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో హైమావతి,డిప్యూటీ డీఎంహెచ్ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి ,హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

**ఖాజీపేట..:** పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతంలా పని చేస్తాయని అంగన్వాడీ సూపర్‌వైజర్ భారతి అన్నారు. సోమవారం ఖాజీపేట మేజర్ పంచాయతీలోని మూడో అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రమాదేవి, సెహరాబీ, శ్రీదేవి, అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.

## 8 మంది అభ్యర్థులు ఎంపిక

జమ్మలమడుగు, ఆగస్టు 5: జమ్మలమడుగులోని దాల్మియా భారత్ ఫౌండేషన్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జమ్మలమడుగు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సులో మూడు నెలలు ఉచిత శిక్షణ పొందినట్లు ప్రిన్సిపాల్ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. వారు శిక్షణ అనంతరం ఎనిమిది మంది అభ్యర్థులు హైదరాబాదులోని ప్రముఖ ఏసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (ఏఐజీ) ఆస్పత్రిలో 2.40 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. దాల్మియా భారత్ ఫౌండేషన్ లొకేషన్ హెడ్ రామరాజు పాల్గొన్నారు.

## రాయలసీమ రైతులకు సాగునీరు అందించాలి

ప్రొద్దుటూరు ఆగస్టు 5 : భారీ వర్షాలకు శ్రీశైలం ప్రాజెక్టు నిండి దిగువకు వదులుతున్నారని రాయలసీమ రైతులకు సాగునీరు అందించేలా ప్రభుత్వం కృషిచేయాలని ప్రజాపక్షం అధ్యక్షుడు న్యాయవాది పుత్తా లక్ష్మీరెడ్డి డిమాండ్‌చేశారు. సోమవారం స్థానిక కేసీ కెనాల్ ఇంజనీరింగ్ అధికారులకు ప్రజాపక్షం నేతలు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పుత్తా లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం జలాశయం నిండి కృష్ణా జలాలు నాగార్జున సాగర్, పులిచింతల ప్రకాశం బ్యారేజీ దాటి సముద్రంలోకి వెళుతున్నాయన్నారు. గాలేరు నగరి, హంద్రీనీవా కేసీ కెనాల్ తెలుగుగంగ కు అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాపక్షం నేతలు పాల్గొన్నారు.

## ఎర్రచందనం దుంగలు స్వాధీనం

### ముగ్గురి అరెస్ట్

మైదుకూరు రూరల్ (దువ్వూరు)ఆగస్టు 5 : మండలంలో ఎర్రచందనం అక్రమరవాణాపై తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు దాసరిపల్లె అటవీప్రాంతంలో అక్రమరవాణాకు సిద్ధంగా ఉంచిన 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని అర్బన్ సీఐ మస్తాన్, ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. దువ్వూరుకు చెందిన పోలయ్యతమిళనాడుకు చెందిన వేలన్‌మణి, రాజన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు.

## మైదుకూరు రూరల్ సీఐగా శివశంకర్



మైదుకూరు రూరల్ ఆగస్టు 5 : సార్వత్రిక ఎన్నికల అనంతరం మైదుకూరులో మొదటిగా రూరల్ సీఐగా శివశంకర్ సోమవారం బాధ్యతలు తీసుకొన్నారు. శివశంకర్ గతంలో చాపాడు ఎస్ఐ గా పనిచేశారు.ఈయన చాపాడు,దువ్వూరు, బ్రహ్మంగారి మఠం మండలాలకు సీఐగా వ్యవహరించనున్నారు.

## ఎర్రగుంట్ల... నరేష్‌బాబు



ఎర్రగుంట్ల, ఆగస్టు 5: ఎర్రగుంట్ల అర్బన్ పోలీసుస్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నరేష్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలకు ముందు ఆయన ముద్దనూరు సీఐగా పపనిచేశారు. అనంతరం రాయచోటి జిల్లాలో వీఆర్‌లో ఉన్నారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ ఈశ్వరయ్య కడప వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఎర్రగుంట్ల ఎస్ఐలు భాస్కర్‌రెడ్డి, చిరంజీవి తదితరులు సీఐ రనేష్ బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

## పోరుమామిళ్ల తహసీల్దారుగా చంద్రశేఖరరెడ్డి



పోరుమామిళ్ల, ఆగస్టు 5 : పోరుమామిళ్ల తహసీల్దారుగా చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు చే పట్టారు. గతంలో ఉన్న శిరీష బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో సోమవారం చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి పోరుమామిళ్ల మండల వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు టీడీపీ నేతలు, ప్రజా సంఘాల నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

## కాశినాయన...టి.బాలనరసింహులు



కాశినాయన ఆగస్టు 5:కాశినాయన తహసీల్దారుగా టి.బాల నరసింహులును ప్రభుత్వం నియమించింది. ఎన్నికలకు ముందు తిరుపతి నుంచి కాశినాయన మండలానికి వచ్చి పనిచేస్తున్న తహసీల్దారు కృష్ణ ఎన్నికల అనంతరం తిరుపతికి బదిలీపై వెళ్ళడంతో సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న టి.బాలనరసింహులును బదిలీపై నియమించారు. ఆమేరకు బాల నరసింహులు సోమవారం నర్సాపురం తహసీల్దారు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

## ముద్దనూరు... రామకుమారి



ముద్దనూరు ఆగస్టు5: ముద్దనూరు తహసీల్దారుగా రామకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె తలపుల నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.ముద్దనూరు తహసీల్దారుగా పనిచేసిన సువర్ణాదేవి అట్లూరు మండలానికి బదిలీపై వెళ్లారు.ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## జమ్మలమడుగు...శ్రీనివాసరెడ్డి



జమ్మలమడుగు, ఆగస్టు 5:జమ్మలమడుగు తహసీల్దారుగా సోమవారం పూర్తి బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు శ్రీనివాసరెడ్డి మండలంలోని సమాచారం తోటి సిబ్బందితో తెలుసుకున్నారు. ఈయన కడప నుంచి జమ్మలమడుగు తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దారు కరుణాకర్ బదిలీపై కదిరి ప్రాంతానికి వెళ్లారు.

## మైలవరం...లక్ష్మీనారాయణ



మైలవరం, ఆగస్టు 5: మైలవరం తహసీల్దారుగా లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

## ఎర్రగుంట్ల...శోభన్‌బాబు



ఎర్రగుంట్ల, ఆగస్టు 5: ఎర్రగుంట్ల తహసీల్దార్‌గా శోభన్‌బాబు బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ డీటీలు తేజశ్విని, రమణారెడ్డి, ఆర్ఐ తరుణ్ ఇతర సిబ్బంది ఆయనకు బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఆయన అనంతపురం జిల్లాలో పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

## చాపాడు...రవీంద్రారెడ్డి



చాపాడు, ఆగస్టు 5: చాపాడు కొత్త తహసీల్దారుగా బి.రవీంద్రారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు వారికి సంబంధించిన భూములు, ఆదాయం, కులం వంటి సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేస్తే వెంటనే సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. ప్రజలందరు సహకరించాలని ఆమె కోరారు.

## బి.మఠం...దామోదర్‌రెడ్డి



బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 5 : బ్రహ్మంగారిమఠం తహసీల్దారుగా దామోదర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో గోపవరం తహసీల్దారుగా విధులునిర్వహిస్తూ ఎన్నికల బదిలీపై కర్నూలు జిల్లాకు వెళ్లి ఎన్నికల అనంతరం బ్రహ్మంగారిమఠానికి బదిలీపై తహసీల్దరుగా వచ్చారు. గతంలో కూడా బ్రహ్మంగారిమఠంలో తహసీల్దారుగా పనిచేసిన అనుభవం ఉంది.

## బీకోడూరు...ఆలీఖాన్



బి.కోడూరు, ఆగస్టు 5 : బీకోడూరు తహసీల్దారు ఆలీఖాన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. నాయకులు రామ్మోహన్‌రెడ్డి, జయరామిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, దుగ్గిరెడ్డి, రాఘవరెడ్డి, నారాయణరెడ్డి, పవన్, నరసింహులు, బాలిరెడ్డి, పెద్దన్న, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## 'ప్రాణహాని కల్గించే ఫ్యాక్టరీని మూసివేయాలి'

ముద్దనూరు ఆగస్టు5:పెద్దదుద్యాల గ్రామస్థుల ప్రాణహాని కల్గించే కెమికల్ ఫ్యాక్టరీ మూసివేయాలని సీపీఐ పార్టీ డిమాండ్ చేసింది. మండల పరిధి పెద్దదుద్యాల గ్రామ సమీపంలోని జీఎం ఎకో కెమికల్ ఫ్యాక్టరీ వద్ద పెద్దదుద్యాల గ్రామ ప్రజలు చేపడుతున్న నిరసన సోమవారానికి పదమూడో రోజుకు చేరుకుంది. గ్రామస్థులకు మద్దతుగా జమ్మలమడుగు నియోజకవర్గ సీపీఐ సహాయ కారదర్శి ప్రసాద్ సంఘీభావంగా నిరసనలో కూర్చొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగేంద్ర, మహబూబ్‌బాషా, జగన్, గ్రామస్థులు సాంబశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.